## కేంద్ర సాయుధ బలగాలతో వికారాబాద్‌లో ప్లాగ్ మార్చ్

-ప్రజలు ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి
-ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యం
-జిల్లా ఎస్పీ ఎన్.కోటిరెడ్డి



వికారాబాద్ పట్టణంలో ప్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న కేంద్ర సాయుధ బలగాలు

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త**

వికారాబాద్ పట్టణంలో కేంద్ర బలగాలు సశస్త్రా సీమా బల్,జిల్లా పోలీసు సిబ్బందితో జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి(ఐపీఎస్) అద్వర్యంలో గురువారం ప్లాగ్ మార్చ్ నిర్వహించారు.ఈ ప్లాగ్ మార్చ్ వికారాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ ఎక్స్ రోడ్డు నుంచి పట్టణంలోని ప్రధాన కూడళ్ళ బిజేఆర్ చౌరస్తా, బస్‌స్టాండ్,రైల్వే స్టేషన్‌ల నుంచి మహాశక్తి చౌరస్తా మీదుగా తిరిగి ఎన్టీఆర్ ఎక్స్‌రోడ్డు దగ్గర వరకు కొనసాగింది.ఈ ర్యాలీలో కేంద్ర బలగాలైన సశస్త్ర సీమా బల్ 3 కంపెనీలు,జిల్లా రిజర్వ్ సిబ్బంది, క్యూఆర్టి,హోంగార్డ్ ఆఫీసర్స్ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతు రానున్న ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు,ప్రజల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించేందుకు ఈ ప్లాగ్ మార్చ్ నిర్వహించడం జరుగుతుందని,అలాగే ప్రజలందరికి జిల్లా పోలీసులు ఎల్లవేళలా తోడుంటారని ప్రజల్లో ధైర్యం కల్పించడానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.ఈ ఎన్నికలను శాంతియుత వాతావరణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించడమే లక్ష్యంగా ఈ ప్లాగ్ మార్చ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఎన్నికల సమయంలో కేంద్ర బలగాలు కీలకపా త్ర పోషిస్తాయని పోలింగ్ కేంద్రాల దగ్గర సాయుధ బలగాలతో కూడిన సిబ్బంది విధులను నిర్వహిస్తుంటారని జిల్లా ఎస్పీ తెలిపారు.కార్యక్రమంలో జిల్లా అదనపు ఎఎస్పీ రవీందర్‌రెడ్డి,డీటీసీ అదనపు ఎస్పీ మురళీధర్,వికారాబాద్ డీఎస్పీ నర్సిములు,డిటిసి డీఎస్పీ విజయ్,ఏఆర్ డీఎస్పీ వీరేష్,డీఎస్బీ ఇన్స్పెక్టర్ డివిపి రాజు,ఆర్ఐలు సూరపునాయుడు,అంజాద్ పాషా, సశస్త్ర సీమా బల్ అసిస్టేంట్ కమాండర్ పవన్ పహాన్,ఇన్స్పెక్టర్‌లు సహదేవ్,సంతోష్,మెడికల్ అధికారి అతిఖాప్ రాజీనా తదితరులు పాల్గొన్నారు.



ప్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న జిల్లా ఎస్పీ కోటిరెడ్డి



# రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్ వార్త

## బిఆర్ఎస్ పార్టీకి,సభ్యత్వానికి చేవెళ్ళ మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం రాజీనామా

-కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో బిజెపిలో తీర్థం

**చేవెళ్ల, అక్టోంబరు 26, ప్రభాతవార్త**

బిఆర్ఎస్ పార్టీకి ప్రాథమిక సభ్యత్వంకు చేవెళ్ళ మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం గురువారం రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను సిఎం కెసిఆర్‌కు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ తారకరామారావుకు అందజేశారు. పార్టీని స్తాపించినప్పటి నుండి పార్టీకి కట్టుబడి ఉన్నానని, గత పది సంవత్సరాలుగా ఏలాంటి పదవులు లేక పోయిన పనిచేశారని, చేవెళ్ల టికెట్‌ను తనకు కేటాయించకపోవడంతో మనస్థాపంకు గురయ్యాయని, అధిష్టానం తీసుకున్న నిర్ణయం చాలా బాధను కల్గించిందన్నారు.చేవెళ్ల నియోజకవర్గ ప్రజల కోరిక మెరకు బిజెపిలో చేరి పోటిచేయాలని నిర్ణయం తీసుకున్నానన్నారు. ఈ నెల 27వ తేదిన కెజిఆర్ గార్డెన్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమక్ష్యంలో బిజెపిలో చేరికను మూహుర్తం చేసుకున్నారు.

## మేడ్చల్ నుంచి బిఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల ఖరారు

-బిజెపి అభ్యర్థి ఖరారులో ఆలస్యం..?
-ఇతర పార్టీలకు ధీటుగా బరిలో ఉండే బిజెపి నాయకుని కోసం కసరత్తులు..?



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి అక్టోబరు 26, ప్రభాతవార్త**

మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఇప్పటికే బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు తమ అభ్యర్థులను ఖరారు చేసినప్పటికీ, ఇక బిజెపి నుంచి అభ్యర్థి ఎవరు అనేది ఖరారు కాకపోవటంతో రాజకీయ నాయకుల దృష్టి అంతా బిజెపి అభ్యర్థి ఎంపిక విషయం చర్చనీయాంశంగ మారింది. ఇతర పార్టీలకు ధీటుగా ఉండే బిజెపి అభ్యర్థిని ఎంపిక చేయటానికి పార్టీ అధిష్టానంలో కసరత్తులు జరుగుతున్నట్లు పార్టీ వర్గాల నుంచి సమాచారం. మేడ్చల్ నియోజకవర్గం నుంచి బిఆర్ఎస్ అభ్యర్థిగా మంత్రి సిహెచ్ మల్లారెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా తోటకూర వజ్రేశ్‌యాదవ్‌ల పేర్లు ఖరారు జరిగిన సంగతి తెలిసిందే. ఇక బిజెపి అభ్యర్థి ఖరారు ఆలస్యం అవుతుండటంతో మేడ్చల్ నుంచి బిజెపి అభ్యర్థిగా టికెట్ ఎవరికి దక్కుతుందన్న విషయంపైనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే బిఆర్ఎస్ పార్టీ ముందుగా తమ అభ్యర్థిని ఖరారు చేయటంతో ఏర్పాట్లు సిద్ధం చేసుకోవటానికి అన్ని రకాలుగ ముందుకు వెళుతూ మండలాల వారీగ, మున్సిపాల్టీల వారీగ సమావేశాలు ముఖ్య నాయకులతో నిర్వహిస్తూ ముందుకు వెళుతున్నారు. ఇక ఆ తరువాత కాంగ్రెస్ అభ్యర్థిని ఖరారు చేయటంతో ముందుగా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో పాటు అసంతృప్తిలో ఉన్న నాయకులను కలిసి పనిచేయటానికి బుజ్జగింపులు జరపటం, మండలాల్లో,మున్సిపాల్టీల్లో ముందుగా ముఖ్య నాయకులతో కాంగ్రెస్ పార్టీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. మండల, నియోజకవర్గ బ్లాక్‌ల స్థాయిల్లో సమావేశాలకు సన్నాహాలు చేసుకుంటు ముందుకు వెళుతున్నారు. అదే విధంగ ఇక బిజెపి నాయకుల్లోనే ఇంతకీ మేడ్చల్ నుంచి బిజెపి అభ్యర్థి ఎవరు ఉంటారనే విషయం చర్చనీయాంశంగ మారింది. అయితే మేడ్చల్ నుంచి బిజెపి బరిలో దిగటానికి టికెట్‌ను మేడ్చల్ జిల్లా బిజెపి రూరల్ అధ్యక్షులు పి.విక్రమ్‌రెడ్డి, ఘట్‌కేసర్ మండల ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, బిజెవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్.రవీందర్‌గౌడ్, జిల్లా బిజెవైఎం నాయకులు పవన్‌రెడ్డి, మరొక నాయకులు బిజెపి టికెట్ రేసులో ఉన్నట్లు పార్టీ వర్గాల నుంచి సమాచారం. అయితే మరెవరు అయినా మేడ్చల్ నుంచి బిజెపి అభ్యర్థిగ కొత్త నాయకుడు వచ్చినా ఆశ్చర్యపోనవసరం లేదని కూడ ప్రచారం జరుగుతుంది.

ఇప్పటికే బిజెపి తొలి జాబితాలో మేడ్చల్ నుంచి అభ్యర్థిని ప్రకటించలేదు. ఇక రెండో జాబితాలో మేడ్చల్ ఉంటుందని బిజెపి టికెట్ కోసం పలువురు నాయకులు ఆసక్తిని చూపుతూ ఎవరికి వారే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని తెలుస్తుంది. ఇక మేడ్చల్ నుంచి ఈ సారి బిజెపి టికెట్ ఓసిలకు దక్కుతుండ లేక బిసిలకు ఏమైనా దక్కుతుందా అనే విషయం కూడ చర్చనీయాంశంగ మారింది. బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ధీటుగ గట్టి పోటీనిచ్చే నాయకునికే మేడ్చల్ బిజెపి టికెట్ ఇస్తే బాగుంటుందనే విషయం కూడ పార్టీ వర్గాల్లో వినపడుతుంది. బిజెపి అధిష్టానం మేడ్చల్ బిజెపి సీటు అభ్యర్థి ఎంపిక విషయంలో ఆచితూచి వ్యవరిస్తున్నట్లు, పార్టీ సర్వేల ఆధారంగ గెలుపుగుర్రాలకు బిజెపి టికెట్ ఇవ్వాలన్న యోచనలో బిజెపి అధిష్టానం ఉన్నట్లు కూడ తెలుస్తుంది. త్వరలోనే బిజెపి రెండవ జాబితా రానుందని దీనిలో మేడ్చల్ అభ్యర్థి ఉంటుందని పార్టీ వర్గాల భావిస్తున్నాయి. ఇప్పటికే పార్టీ సమావేశాలు, నాయకులతో మంతనాలు అంటూ లేక బిజెపి నాయకుల్లో అసంతృప్తిలు వెల్లువెత్తుతున్నట్లు స్పష్టం అవుతుంది. బిజెపి అభ్యర్థి ఎంపిక ఆలస్యంతోనూ మరింత నిరుత్సాహంలో పార్టీ క్యాడర్ ఉన్నట్లు కూడ తెలుస్తుంది. ఇక మేడ్చల్ బిజెపి అభ్యర్థి ఖరారు కోసం పార్టీ శ్రేణులు ఎదురు చూస్తున్నట్లు చెప్పవచ్చు. మేడ్చల్‌లో ఇతర పార్టీలకు ధీటైన అభ్యర్థిని పోటీలో దింపితేనే బాగుంటుందని పార్టీ వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం.

## దేశానికి ఆదర్శంగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి

**షాబాద్, అక్టోబర్ 26, ప్రభాతవార్త :**

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని సమాచార పౌరసంబంధాలు, గనులు భూగర్భవనరుల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని నాగర్‌గూడ చౌరస్తా నుండి షాబాద్ వరకు భారీ బైక్ ర్యాలీని జడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యలతో కలిసి నిర్వహించారు. షాబాద్ మండల కేంద్రంలో పార్టీ జెండాను ఆవిష్కరించి అంబేద్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన ప్రజా ఆశీర్వాదసభలో వారు మాట్లాడుతూ.... తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి ఏదో ఒక రూపంలో అందుతున్నాయన్నారు. రాష్ట్రంలోని అతిపెద్ద పారిశ్రామిక హబ్‌గా చందన్‌వెల్లి, సీతారాంపూర్ రూపాంతరం చెందుతు ందన్నారు. భవిష్యత్‌లో షాబాద్ మండల ప్రపంచస్థాయంలో గుర్తింపు వచ్చే అవకాశం ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయమన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలతో ఇక్కడి రైతులకు త్వరలోనే నీరు వస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ 6గా ్యరంటిలను నమ్మి ప్రజలు మోసపోవద్దు అన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్యను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈకార్యక్రమంలో జడ్ ్పటీసీ పట్నం అవినాష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ జడల లక్ష్మిరాజేందర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మెన్ శేఖర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మెన్ నర్సింగ్‌రావు, మాజీ ఏఎంసీ చైర్మెన్లు శ్రీనివాస్‌గౌడ్, వెంకటయ్య, స్వప్ననర్సింహారెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీరాంరెడ్డి, సర్పంచులు ప్రభాకర్‌రెడ్డి, కృష్ణగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, జంగయ్య, చంద్రశేఖర్, దర్శన్, జయమ్మ, మహేందర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు గోపాల్‌నాయక్, నాయకులు రాజేందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, మద్దూర్ మల్లేష్, రమేష్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

## నువ్వా... నేనా... అంటూ ప్రచారం

- సమరానికి సై అంటున్న కాంగ్రెస్ - బీఆర్ఎస్
- ముమ్మర కార్యక్రమాలతో ప్రచారంలో దూసుకుపోతున్న ఇరు పార్టీలు



కేశంపేటలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వీర్లపల్లిశంకర్.



కమ్మదనంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

**షాద్‌నగర్, అక్టోంబర్ 26, (ప్రభాతవార్త) :**

షాద్‌నగర్ నియోజకవర్గంలో అధికార బీఆర్ఎస్ పార్టీ, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలు ప్రచారంలో నువ్వా... నేనా... అన్నట్లు దూసుకుపోతున్నాయి. రెండు పార్టీల అభ్యర్థులు నియోజకవర్గంలో గురువారం ముమ్మర ప్రచార కార్యక్రమాలు చేపట్టి సమరానికి సై అంటూ నిమిషం కూడా సమయం వృధా చేయడం లేదు. అటూ పార్టీలోకి చేరికలు చేపడుతునే ఇటూ ప్రచారం కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు.

**అటూ... అంజయ్యయాదవ్...**

గురువారం ఉదయం నుంచే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం గ్రామంలో మొదలుకొని గంట్లవెల్లి, మధురాపూర్, బూర్గుల, కాశిరెడ్డిగూడ తదితర గ్రామాలల్లో ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఇదే సమయంలో ఆయా గ్రామాల్లోని పలువురు ఇతర పార్టీల నాయకులు సహితం ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సమాక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అదేవిధంగా ఎమ్మెల్యే తనయులు కేశంపేట ఎంపీపీ రవీందర్‌యాదవ్, మురళీధర్‌యాదవ్‌లు సహితం వివిధ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఎన్నికల వేళ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సమయం వృధా చేయకుండా ముమ్మర ప్రచారం నిర్వహిస్తూ ప్రజలకు అధికార పార్టీ చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు. మీసేవకుడిగా పనిచేస్తాను మళ్లీ అవకాశం ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు.

**ఇటూ... వీర్లపల్లి శంకర్...**

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వీర్లపల్లి శంకర్ సహితం తన ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. గురువారం కేశంపేట మండల కేంద్రంలో పార్టీ కార్యాలన్ని ప్రారంభించి, అధిక శాతంతో ఇతర పార్టీల నాయకులు ఆయన సమాక్షంలో పార్టీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదేవిధంగా వీర్లపల్లి శంకర్ ప్రచారానికి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డిలు సహితం తమ వంతుగా ప్రచారాలు నిర్వహిస్తున్న పార్టీలో అసమ్మతితో ఉన్న పలువురు నాయకులను సహితం బుజ్జగించి వీర్లపల్లిశంకర్‌కు మద్దతుగా నిలిచేలా కృషి చేస్తూ పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. అధికార ప్రతిపక్షా పార్టీలు తమ తమ ప్రచారాలు ముమ్మరం చేయడంతో పండగ వేళ సహితం షాద్‌నగర్ నియోజకవర్గంలో నాయకులు బీజీ బీజీగా గడుపుతున్నారు.

## ఎన్నికల విధులను పకడ్బంధీగా నిర్వహించాలి

-క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై చర్యలకు ప్రణాళికలు సిద్ధం చేయాలి
-మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన జిల్లా కలెక్టర్ గౌతమ్, పాల్గొన్న అదనపు కలెక్టర్లు, డిఆర్ఓ, అధికారులు తదితరులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి అక్టోబరు 26, ప్రభాతవార్త**

ఎన్నికల విధులను పకడ్బంధీగ నిర్వహించాలని మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులకు సూచించారు. గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఎన్నికలకు సంబంధించి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగ కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించిన స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల వివరాలు పంపాలన్నారు. ఫారం 6,7,8కు సంబంధించి ప్రతి రోజు పెండింగ్ లేకుండ చూడాలన్నారు. ఈవిఎంలపై శిక్షణ కోసం అధికారులు సిద్ధంగ ఉండాలన్నారు. ఎఫ్ఎస్‌టి, విఎస్‌టి బృందం వాహనాలకు జిపిఎస్ ఏర్పాటు, వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్ఓలు, ఈఆర్ఓలతో పలు అంశాలపై చర్చించి అధికారులకు సూచనలు చేశారు. ఎన్నికల సమయంలో జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు సంబంధించిన స్ట్రాంగ్‌రూమ్‌ల, కౌంటింగ్ కేంద్రాలకు సంబంధించిన అన్ని వివరాలను మార్పులు, చేర్పులకు సంబంధించిన పూర్తి సమాచారంతో అధికారులు సిద్దంగ ఉండాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల ప్రవర్తన,నియమావళి ఉల్లంఘనలు జరగకుండ పటిష్టమైన చర్యలు తీసుకునే క్రమంలో జిల్లాలో ఎన్నికల విధులకు కేటాయించిన సిబ్బంది అందరు విధులను సక్రమంగ నిర్వహించాలని సూచించారు. ఫారం 6,7,8కు సంబంధించి డిస్పోజల్సు ప్రతి రోజు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉండకుండ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఐదు నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాల,మార్పులు,చేర్పుల గురించి ఆర్ఓలను అడిగి తెలుసుకున్నారు. స్ట్రాంగురూమ్స్, కౌంటింగ్ కేంద్రాల పూర్తి వివరాలను ప్రతిపాదనల కోసం త్వరగా అధికారులు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్ప కుండ పాటించాలన్నారు. స్ట్రాంగురూమ్స్,కౌంటింగ్ కేంద్రాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్, పోస్టల్ బ్యాలెట్ గురించి తెలుసుకోవాలని, కౌంటింగ్‌కు ముందుగానే సిబ్బందిని గుర్తించి ఎంపిక చేయాలని ఆయన సూచించారు. జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సంబంధిత అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి చేపట్టాల్సిన చర్యలపై ప్రణాళిక తయారు చేసి తనకు పంపాలని అన్నారు. దీనిలో పలు అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించి తీసుకోవాల్సిన చర్యల గురించి ఆరా తీశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ ఆగస్త్య, డిఆర్ఓ హరిప్రియ, ఎన్నికల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటింటికి బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రచారం చేయండి: మంత్రి మల్లారెడ్డి



అన్నోజిగూడలో జరిగిన బీఆర్ఎస్ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి.

**ఘట్‌కేసర్ రూరల్, అక్టోబర్ 26, ప్రభాతవార్త:**

బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బూత్ స్థాయి కార్యకర్తలు ఇంటింటీకి ప్రచారం చేసి బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కొరకు కృషి చేయాలని మంత్రి మల్లారెడ్డి అన్నారు. పోచారం మున్సిపల్ బీఆర్ఎస్ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అధ్యక్షతన గురువారం అన్నోజిగూడ శివాస్ ఫంక్షన్ హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలే తిరిగి బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయని అన్నారు. కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలు వట్టివేనని వాటిని అమలు చేసే సత్తా ఆపార్టీకి లేదని అన్నారు. చైర్మన్ బి. కొండల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు మందాడి సురేందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంటు బాలేశ్ కురుమ, మున్సిపల్ వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, బీఆర్ఎస్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శేఖర్ ముదిరాజ్, మున్సిపల్ కౌన్సిలర్లు సింగిరెడ్డి సాయిరెడ్డి, బాలగోని వెంకటేశ్‌గౌడ్, చింతల రాజశేఖర్, మెట్టు బాల్‌రెడ్డి, ఎస్. రవీందర్ గౌడ్, ఎం. పోచమ్మ, ఆకిటి శైలజరెడ్డి, నాయకులు బి. జగన్‌మోహన్‌రెడ్డి, అబ్బవతి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## కడుపునొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య

**షాబాద్, అక్టోబర్ 26, ప్రభాతవార్త :**

కడుపునొప్పి భరించలేక యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగర్‌కుంట గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. షాబాద్ ఎస్సై మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.... మండల పరిధిలోని నాగర్‌కుంట గ్రామానికి చెందిన చిర్ర రమేష్(23) ట్రాలీ ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. గత కొంతకాలంగా కడుపునొప్పి ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. కడుపునొప్పి భరించలేక గత 15రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి నాలుగు రోజుల పాటు చికిత్స నిర్వహించి ఇంటికి తీసుకువచ్చారు. ఇంటికి వచ్చినప్పటి నుండి కూడా కడుపులో మంట అని పదేపదే కుటుంబ సభ్యులకు చెప్పేవాడు. గురువారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో ప్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని త ండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మేడ్చల్ బీఆర్ఎస్‌లో సీనియర్లు కనుమరుగు

-సీనియర్లను కలుపుకోకుండా పర్యటనలు -ఆవేదనలో మండల సీనియర్లు -ఇలా కొనసాగితే పార్టీకి ముప్పే -ముఖ్య నాయకుల అభిప్రాయం

**మేడ్చల్, అక్టోబర్ 26. ప్రభాతవార్త :**

గ్రామాల్లో పార్టీ కార్యకర్తలను ప్రోత్సహించాలన్నా, గ్రామాల్లో నూతన కమిటీలు ఏర్పాటుచేయాలన్నా మండల స్థాయి పార్టీ నాయకులు కలిసికట్టుగా అందరిని కలుపుకుని వెళుతుంటారు. మేడ్చల్ మండల బీఆర్ఎస్ పార్టీలో మాత్రం ఆ తంతు కనపడటం లేదు. పార్టీ సీనియర్ నాయకులను కలుపుకోకుండా ఇతర పార్టీ నుంచి వచ్చిన నాయకులకు అవకాశం ఇస్తూ తమను ఖాతరు చేయడం లేదని పలువురు స్వంత పార్టీ నాయకులే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మేడ్చల్ మండలంలోని వివిద గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ బూత్ కమిటీల ఏర్పాటు చేస్తూ పార్టీ అభివృద్ధితో పాటు రాబోయే ఎన్నికల్లో ఓట్లు రాబట్టుకునే కార్యక్రమానికి ప్రక్రియ కొనసాగుతున్నది. ఈ కమిటీల ఏర్పాటు వల్ల స్థానిక నాయకులను, కార్యకర్తలను కలిసి మాట్లాడటంతో పాటు పార్టీ గెలుపుకు పలు సూచనలు చేయడం జరుగుతున్నది. ఇలాంటి కార్యక్రమానికి మండల పార్టీ సీనియర్ నాయకులను పిలువ కుండా, కనీసం సమాచారం ఇవ్వకుండా మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులతో పాటు ఒకరిద్దరు నాయకులు మాత్రమే వెళ్లి గ్రామాల్లో కమిటీలను వేసి, గ్రామ నాయకులతో సమావేశాలు నిర్వహించడం ఎంతవరకు సమంజసమని పలువురు పార్టీ నేతలే ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల సమయంలో కూడ ఎవరికి వారే యమునా తీరే అనే చందంగా నడుచుకుంటే పార్టీ గెలుపు కోసం అందరూ కలిసి పని చేసే అవసరం లేదా అనే వాదనలు వినిపిస్తున్నాయి. ఓ పక్క కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గంలో సీనియర్ నాయకుల సమ్మేళనంతో ముందుకు దూసుకుపోతూ ఆయా పార్టీలతో పాటు అధికార పార్టీ నాయకులను, కార్యకర్తలను ఆకర్శిస్తుంటే అధికార బీఆర్ఎస్ పార్టీ మాత్రం తమ కారు నిండుగా ఉందని తమకు ఎవరితో సంబంధం లేదని, సీనియర్ నాయకులతో పెద్ద సంబంధం లేదనే దోరణిలో ముందుకు వెళుతున్నారు. దీంతో పార్టీ ఇబ్బంది పాలయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయని పార్టీ శ్రేణులు లోలోన అభిప్రాయం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికైనా మేడ్చల్ అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి మల్లారెడ్డి పట్టించుకుని క్షేత్రస్థాయిలో పార్టీ పనితీరు కోసం దృష్టి సారించాల్సిన అవసరం ఉందని, కొందరిని మాత్రమే నమ్ముకుని వదిలేస్తే తిప్పలు తప్పవనే భావనలు వ్యక్తం అవుతున్నాయి. ఒంటెద్దు పోకడతో ఎవరికి చెప్పేది లేదనుకునే దోరణిలో వెళుతున్న నాయకుల తీరుతో వచ్చే ఎన్నికల నాటికి పార్టీ పరిస్థితి ఎలా మారనుందోననే చర్చలు కొనసాగుతున్నాయి.

## దామగుండం అడవిలో చిరుత సంచారం

-అడవికి ఆనుకొని ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
-త్వరలో పట్టుకుంటాం
: జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్



దామగుండం అడవిలో అమర్చిన సిసి కెమెరా పుటేజీలో కనబడిన చిరుత

**పూడూరు, అక్టోబర్ 26, ప్రభాతవార్త :**

వికారాబాద్ జిల్లా పూడూరు మండల కేంద్రం సమీపంలోని దామగుండం అటవీ ప్రాంత్రంలో చిరుతపులి సంచరిస్తున్నట్లు గత మూడు రోజులుగా పుకార్లు శికారు చేశాయి.అయితే ఈనెల 23వ తేదీన పూడూరు గ్రామానికి చెందిన శ్రీశైలం అనే రైతు తన పశువులను మేసేందుకు అడవిలో కట్టేసి ఇంటికి వచ్చాడు.సాయంత్రం అడవిలో కట్టేసి ఉంచిన పశువుల దగ్గరకు వెళ్లి చూడగా,అందులో ఓలేగదూడపై గుర్తుతెలియని అటవీ జంతువు దాడిచేసి చంపివేసినట్లు అనుమానించి ఆందోళన చెందాడు.ఈ విషయం గ్రామస్తులకు తెలుపగా చనిపోయిన లేగదూడపై దాడిచేసింది చిరుతపులా?లేక హైనానా?అన్న అనుమానం వ్యక్తం చేశారు.దీంతో గత మూడురోజులుగా అటవీ చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తూ అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా,స్పందించిన సంబంధిత అధికారులు లేగదూడపై దాడి చేసిన ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి అటవీ ప్రాంతంలో సిసి కెమెరాలను అమర్చారు.అయితే అటవీ ప్రాంతంలో చిరుతపులి కదలికలను బుధవారం సిసి కెమెరా పుటేజీలద్వారా కనుగొన్న అటవీశాఖ అధికారులు ఈ ప్రాంతంతో తిరుగుతున్నది చిరుతేనని నిర్ధారణకు వచ్చారు.ఈ సందర్భంగా గురువారం జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ దామగుండం అడవిలో చిరుత సంచరిస్తున్నది వాస్తవమేనని నిర్ధారించారు.చిరుతను బంధించేందుకు బోనులను ఏర్పాటు చేస్తామని,అప్పటి వరకు అడవికి సమీపంలో ఉన్న పూడూరు,గొంగుపల్లి తదితర చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అడవిలోకి ఒంటరిగా వెళ్లకూడదని హెచ్చరించారు. పశువులను మేపేందుకు అడవికి వెళ్లే పశువుల కాపరులుకూడా ఒంటరిగా వెల్లకూడదని,చిన్న పశువులను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.

## బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన పోచారం మాజీ సర్పంచులు



మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో పోచారం మున్సిపల్‌కు చెందిన మాజీ సర్పంచులు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన దృశ్యం.

**ఘట్‌కేసర్ రూరల్, అక్టోబర్ 26, ప్రభాతవార్త:**
ఇటీవల మాజీ ఎమ్మెల్యే ఎం. సుధీర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో ఆపార్టీలో పూర్వపు ఘట్‌కేసర్ మండలం నుండి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరికలు ఊపందుకున్నాయి. తాజాగా పోచారం మున్సిపల్‌కు చెందిన మాజీ సర్పంచులు గాంధారీ లక్ష్మీనారాయణ, చిన్న నర్సింహులు గౌడ్‌లతో పాటు పలువురు గురువారం మాజీ ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు, కార్యకర్తలతో ఆపార్టీలో జోష్ పెరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో చేరిన నాయకులు పాతవారిని కలుపుకుని కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కొరకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వి. మహేశ్ గౌడ్, పోచారం మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు కొంతం శంకర్ రెడ్డి, సింగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, దేవేందర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

## గ్రామాల్లో బీఆర్ఎస్ బూత్ కమిటీల ఏర్పాటు



రావల్‌కోల్ గ్రామంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ బూత్ కమిటీ సభ్యులతో నాయకులు

**మేడ్చల్, అక్టోబర్ 26. ప్రభాతవార్త :**
బీఆర్ఎస్ పార్టీ బూత్ కమిటీలను మేడ్చల్ మండలంలోని రావల్‌కోల్, ఎల్లంపేట్, రాజబొల్లారం తండా, మునీరాబాద్ గ్రామాల్లో గురువారం ఏర్పాటు చేశారు. మండల పార్టీ నాయకులు ఈ గ్రామాల్లో పర్యటించి, స్థానిక గ్రామ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి కమిటీలను నియమించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, యువజన శాఖ అధ్యక్షుడు హరత్‌రెడ్డి, సర్పంచ్‌లు మహేందర్, వెన్నెల రామకృష్ణుడు, మాంగ్యా నాయక్, గణేష్, నాయకులు రాజమల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, రవి, రాజశేఖర్, రవి నాయక్, నరేందర్, సత్తిరెడ్డి, నవనీత తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి భూమి పూజ



పూడూర్‌లో నిర్వయించిన పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణ భూమిపూజలో పాల్గొన్న సంఘం సభ్యులు

**మేడ్చల్, అక్టోబర్ 26. ప్రభాతవార్త :**
మేడ్చల్ మండలంలోని పూడూర్ గ్రామంలో గురువారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి భూమి పూజ ఘనంగా నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్చరణలతో శాస్త్రోక్తంగా పూజలు జరిపి యంత్ర ప్రతిష్ట, శంకుపూజ చేశారు. అనంతరం పూర్ణాహుతి హోమ కార్యక్రమాన్ని నిర్వయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాబు యాదవ్, ఎంపీటీసీ రఘు, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు యాదయ్య, మాజీ అధ్యక్షుడు రామలింగం, యూత్ అధ్యక్షుడు నాగరాజు, ఉపాధ్యక్షులు పంమేశ్, శ్రీరాం, గౌతమ్, ప్రధాన కార్యదర్శి శ్రావణ్, రమేష్, సంఘం నాయకులు కృష్ణ, బాలు, దేవేందర్, ప్రభాకర్, నర్సింహ, శ్రీనివాస్, రాజు, నాయకులు మల్లికార్జున్, వెంకటేష్, రాములు, కృష్ణ, శంకర్ పాల్గొన్నారు.

## మేడ్చల్‌లో కాంగ్రెస్‌లో చేరికలు



కాంగ్రెస్ పార్టీలో చేరిన సుతారిగూడ గ్రామ నాయకులు

**మేడ్చల్, అక్టోబర్ 26. ప్రభాతవార్త :**
కాంగ్రెస్ పార్టీపై నమ్మకంతో నేడు ఇరత పార్టీల నాయకులు తమ పార్టీలో చేరుతున్నారని మేడ్చల్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వజ్రేష్ యాదవ్ అన్నారు. మేడ్చల్ మండలంలోని గుండ్లపోచంపల్లి మున్సిపల్ మున్సిపల్ పరిధి సుతారిగూడ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ వెంకటేష్ ముదిరాజ్, మాజీ వార్డు సభ్యుడు నందుతో పాటు వంద మంది కార్యకర్తలు వజ్రేష్ యాదవ్ సమక్ష్యంలో గురువారం కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి అహ్వానించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాని, మేడ్చల్ నియోజకవర్గంలో కాని గెలిచేది కాంగ్రెస్ పార్టీ అని, ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా తమ పార్టీ గెలువడం తధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ కౌన్సిలర్ చాప రాజు, నాయకులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరికలు ...

**మేడ్చల్, అక్టోబర్ 26. ప్రభాతవార్త :**
సీఎం కేసీఆర్‌పై ఉన్న నమ్మకంతోనె కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ పట్టణ కాంగ్రెస్ పార్టీకి చెందిన నర్సింగ్ రావుతో పాటు పలువురు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా వారికి మంత్రి కండువా కప్పి పార్టీలోకి అహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ హయంలో సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. ప్రజలకు మేలు చేసే వ్యక్తి సీఎం కేసీఆరే అనే నమ్మకం ప్రజల్లో కలిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ భాస్కర్ యాదవ్, బీఆర్ఎస్ మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామస్వామి, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ సత్యనారాయణ, కో ఆప్షన్ సభ్యుడు నవీన్‌రెడ్డి, నాయకులు బాలమల్లేష్, వెంకటేష్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరిన నర్సింగ్‌రావుకు కండువా కప్పుతున్న మంత్రి మల్లారెడ్డి

## ప్రజావ్యతిరేక బీఆర్ఎస్‌కు ఎన్నికల్లో గుణపాఠం తప్పదు : మాజీ ఎమ్మెల్యే

**-కొర్రెములకు చెందిన దాదాపు 200 మంది కార్యకర్తలు బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరిక**



కొర్రెములకు చెందిన ఎఫ్ఎస్‌సీఎస్ డైరక్టర్ గోపు బాల్‌రాజ్ యాదవ్ బీఆర్ఎస్‌ను వీడి మాజీ ఎమ్మెల్యే ఎం. సుధీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న దృశ్యం.

**ఘట్‌కేసర్ రూరల్, అక్టోబర్ 26, ప్రభాతవార్త:**
ప్రజా వ్యతిరేక పాలన చేసిన బీఆర్ఎస్‌కు ఈ ఎన్నికల్లో గట్టి గుణపాఠం చేప్పేందుకు ప్రజలు సిద్దంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండలం కొర్రెముల గ్రామానికి చెందిన ఎఫ్ఎస్‌సీఎస్ డైరక్టర్, బీఆర్ఎస్ నాయకుడు అయిన గోపు బాల్‌రాజ్ యాదవ్ దాదాపు 200 మంది అనుచరులతో గురువారం మాజీ ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పార్టీలో చేరడానికి విచ్చేసిన గోపు బాల్‌రాజ్ యాదవ్‌తో పాటు మెట్టు రాములు, బాత్క జంగయ్య, ఎడ్ల మల్లేశ్, బాత్క రాజు, ముంత మధు, గోపు వెంకటేశ్ యాదవ్, గోపు బిట్టు, పిండి మహేశ్, బండ్ల పవన్, శ్యామల, సాయి, చిలుకల మల్లిఖార్జున్ తదితరులు పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేశ్ యాదవ్ గెలుపుకొరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కర్రె రాజేశ్, బొడుప్పల్ మున్సిపల్ కౌన్సిలర్ తోటకూర అజయ్ యాదవ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ కార్యదర్శి వంశీ యాదవ్, మండల యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రవణ్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు కందుల కుమార్ ముదిరాజ్, దామోదర్ రెడ్డి, కొర్రెముల సిద్దగోని నర్సింహా గౌడ్‌గ్రామ శాఖ అధ్యక్షుడు బైండ్ల జంగయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాండు రంగచారి పాల్గొన్నారు.

## బిజెపి అధిష్ఠానం అందెబాబయ్యకు పిలుపు

**- బుజ్జగింపా... లేక టికెట్టా....?**
**- నియోజకవర్గంలో బీజేపీ నాయకుల్లో టెన్షన్...**

**షాద్‌నగర్, అక్టోంబర్ 26, (ప్రభాతవార్త) :**
షాద్‌నగర్ సీనియర్ నాయకుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెబాబయ్యకు ఢిల్లీ బీజేపీ అధిష్ఠానం నుంచి బుధవారం పిలుపువచ్చింది. దీంతో నియోజకవర్గంలో ఒక్కసారిగా చర్చనీయంశమైంది. అటూ బీజేపీ ఆశవాహుల్లో... ఇటూ పార్టీ కార్యకర్తల్లో టెన్షన్ నెలకొంది. అందెబాబయ్యకు బుజ్జగింపా... లేక టికెటా అన్న సందేహంతో చర్చలు మొదలయ్యాయి. బీజేపీ అధిష్టానం మొదటి విడతలో ఇక్కడి అభ్యర్థిని ఖారారు చేయకపోవడంతో టికెట్ ఆశీస్తున్న సీనియర్ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందెబాబయ్య, మిథున్‌రెడ్డిలు తమ ప్రచారాలను ముమ్మరం చేశారు. విజయదశమిని పురస్కరించుకొని ప్రచారా రథలను సహితం పూజలు చేసి గ్రామాల్లో ఎవరి అంతకు వారు ముమ్మరంగా ప్రచారాలు చేపట్టారు. దీంతో ఉన్నఫలంగా సీనియర్ నాయకుడు అందెబాబయ్యకు ఢిల్లీ నుంచి పిలుపు రావడంతో ఏం జరగబోతుందా అని అందరు వేచిస్తున్నారు. ఒక పక్క అధికార ప్రతిపక్ష పార్టీలు అయిన బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు తమ అభ్యర్థులను ప్రకటించడంతో వారు ఇప్పటికే ముమ్మర ప్రచారాల్లో మునిగిపోయారు. బీజేపీ అభ్యర్థిని ప్రకటించడంలో అధిష్టానం ఆలస్యం చేయడంతో నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. ఎవరు ఎవరికీ సపోర్టు చేయాలో తెలియని పరిస్థితి. ఇదే సమయంలో టికెట్ ఆశిస్తున్న నాయకులు ప్రచారాలు మొదలు పెట్టడంతో కింది స్థాయి నాయ కులు సహితం తమ ఇష్టానుసారంగా వ్యవహరించి రెండు వర్గాలుగా విడిపోయి కొట్టుకునే పరిస్థితికి దిగజారిపోతున్నారు. ఇకనైనా పార్టీ అధిష్టానంనియోజకవర్గం అభ్యర్థిని త్వరగా డిక్లర్ చేయాలని పలువురు కోరుతున్నారు. మరీ ఢిల్లీ వెళ్లిన అందెబాబయ్యకు అధిష్టానం ఏం చెప్పుతోనని పార్టీ నాయకులు వెచిచూస్తున్నారు.

## కాంగ్రెస్ పార్టీ గెలుపునకు సమిష్టిగా కృషి చేయాలి

**ఘట్‌కేసర్, అక్టోబర్ 26, ప్రభాతవార్త:**
అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ గెలుపుకోసం సమిష్టిగా కృషి చేయాలని మున్సిపల్ నేతలు నిర్ణయించారు. ఘట్‌కేసర్ మున్సిపల్ శివారెడ్డిగూడలోని బంధన్ పంక్షన్‌హాలులో గురువారం మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాల్‌యాదవ్ అధ్యక్షతన కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శాసనసభ ఎన్నికలు, మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ గెలుపుకోసం చేయాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. జిల్లా, మున్సిపల్, బూత్ స్థాయి నాయకులు సమన్వయంతో పనిచేస్తూ పార్టీ ఆదేశాల మేరకు పార్టీ బతోపేతానికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఈసందర్భంగా మున్సిపల్ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన ముత్యాల్‌యాదవ్‌ను నాయకులు శాలువా కప్పి సన్మానించారు. ఈసమావేశంలో పిసిసి మాజీ కార్యదర్శి కట్టా జనార్దన్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి ఉల్లి అంజనేయులు, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సగ్గు అనిత, డీసీసీ మాజీ సభ్యులు ఎన్‌వై. భానుప్రకాష్, మాజీ సర్పంచ్ డక్కి రమేశ్, మాజీ వార్డుసభ్యులు కొంతం రాంరెడ్డి, అ బ్రహం రాజు, జిల్లా మైనారిటీసెల్ కార్యదర్శి ఎం.ఎ. రహమాన్, ఫారూఖ్, ఎన్ఎస్‌యుఐ మేడ్చల్ నియోజకవర్గ అధ్యక్షులు చందుపట్ల సాయిచరణ్‌రెడ్డి, మున్సిపల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవరెడ్డి, నాయకులు కట్కూరి నర్సింగ్‌రావు, బొక్క సత్తిరెడ్డి, రాజారత్నం, సురేశ్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో జరిగిన కాంగ్రెస్‌పార్టీ సమావేశంలో మున్సిపల్ అధ్యక్షులు ముత్యాలుయాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

## చట్టసభలలో దివ్యాంగులకు పోటీ చేసే అవకాశం కల్పించాలి

**-సొసైటీ ఫర్ ది డీఫ్(డిఎస్‌డి) జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్**

**చిక్కడపల్లి, అక్టోబరు 26 ప్రభాతవార్త:** చట్టసభలలో దివ్యాంగులకు పోటీ చేసే అవకాశం కల్పించాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డీఫ్(డిఎస్‌డి) జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, కోకన్వీనర్ కాటమోని వెంకటేశ్‌గౌడ్ అన్ని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని సంస్థ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని శాసనసభ స్థానాలల్లో అన్ని రాజకీయ పార్టీలు పోటీ చేసే స్థానాలను కేటాయించాలని, రాష్ట్రంలో 20లక్షలకుపైగా జనాభా గల దివ్యాంగులకు 5శాతం రిజర్వేషన్ కేటాయించకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. రాజస్థాన్ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు 5శాతం రిజర్వేషన్ ఇవ్వడం జరిగిందని, వికలాంగుల పరిరక్షణ చట్టం-2016 ప్రకారం దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించి అవకాశం కల్పించాలని రాజకీయ పార్టీలు, ప్రభుత్వ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డిఎస్‌డి ప్రతినిధులు హబీబ్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## మాధవపెద్ది సత్యం స్వరం విలక్షణం వైవిధ్యం

**-విశ్రాంత అదనపు డీజీపీ గోపినాథ్‌రెడ్డి**

**చిక్కడపల్లి, అక్టోబరు 26 ప్రభాతవార్త:** మాధవపెద్ది సత్యం స్వరం విలక్షణం వైవిధ్యంతో కూడి ఉంటుందని విశ్రాంత అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలిస్ డాక్టర్ సిఎన్. గోపినాథ్‌రెడ్డి అన్నారు. గురువారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో శ్రీభారతి మ్యూజిక్ అకాడమి అధినేత, ప్రముఖ గాయకుడు చింతలపాటి సురేశ్ ఆధ్వర్యంలో తెలుగు సినీ నేపథ్యగాయకుడు మాధవపెద్ది సత్యం శతజయంతి వేడుకలు సంగీత భరితంగా జరిగాయి. ప్రముఖ కవి డాక్టర్ ఎం.కె. రాము అధ్యక్షత జరిగిన ఈ సభా కార్యక్రమానికి ముందు ముఖ్యఅతిథిగా హాజరైన గోపినాథ్‌రెడ్డి పాల్గొని సుస్వర భారతి పురస్కారాలను ఆమనీ, రావూరి మాధవి, జ్యోతిర్మయి బొమ్ములకు, శ్రీభారతి మాధవపెద్ది శతజయంతి పురస్కారాలను నటి నర్తకి సబితకు, మాధవపెద్ది కుమార్తె నాగలక్ష్మికి, పాడుతా తీయగా ఫేమ్ ప్రవీణ్‌కుమార్‌కు బహుకరించి ప్రసంగించారు. వివాహ భోజనంబు పాటతో మాధవపెద్ది సత్యం ప్రతిభ కనిపిస్తుందని, సంగీతం సాతమ వేద జనితం అని, పద్యాలు ఆలాపన చేసే గాయకులకు శ్వాసకోశము, మనస్సు, స్వరం మూడు సమపాళ్ళలో ఉండాలని చెప్పారు. నిర్వాహక సంస్థ అధినేత సత్యం క్రమం తప్పకుండా మాధవపెది సత్యం జయంతి వేడుకలను జరపడం అభినందనీయమని, ఆయన గళం మాధవపెద్ది స్వరాన్ని పోలిఉంటుందన్నారు. డాక్టర్ఎం.కె. రాము మాట్లాడుతూ పురస్కారాలు ఎంపికైన వారందరు అర్హులేనని అన్నారు. కార్యక్రమంలో సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, విశ్వనాథ్ మద్దిపట్ల తదితరులు పాల్గొనగా చింతలపాటి సురేశ్ స్వాగతం పలికారు. తొలుత సురేశ్ పాడిన మాధవపెదిన సత్యం పాటలు ప్రవీణ్ పాడిన పద్యంతో ఇతర గాయకులు యుగళ గీతాలు ఆకట్టుకున్నాయి.

## తేనుగూడెం కుమ్మరికుంటలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

**ఘట్‌కేసర్, అక్టోబర్ 26, ప్రభాతవార్త:** కుమ్మరికుంట చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్ గ్రామపంచాయతీ తేనుగూడెం సమీపంలోని కుమ్మరికుంట చెరువులో ఓవ్యక్తి శవం ఉందని స్థానికులు సర్పంచ్, పోలీసులకు సమాచారం అందించారు. ఈమేరకు పోచారం ఐటీ కారిడార్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని నీటి నుంచి బయటకు తీసి పరిశీలించారు. దాదాపు 36 సంవత్సరాలు కల్గిన వ్యక్తి మృతదేహం కుళ్లిపోయిందని, ఎత్తు 5.6 అడుగులు ఉంటాడని, బ్రౌన్ రంగు టిషర్ట్, నీలం రంగు జీన్స్ ధరించి ఉన్నాడని, మనికట్టుకు తాడుముడి వేసి ఉందని పోలీసులు తెలిపారు. ఈమేరకు శవాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోచారం ఐటీసీ ఇన్‌స్పెక్టర్ వి. అశోక్‌రెడ్డి తెలిపారు.

## 119 స్థానాల్లో జైస్వరాజ్ పార్టీ పోటీ

**అధ్యక్షులు కాసాని శ్రీనివాస్‌రావుగౌడ్ వెల్లడి**

**హైదరాబాద్, అక్టోబర్ 26, ప్రభాతవార్త:** పేదరిక నిర్మూలనే ప్రధాన ఎజెండాగా జైస్వరాజ్ పార్టీ రాష్ట్రంలోని 119 స్థానాల్లో పోటీచేస్తుందని ఆపార్టీ అధ్యక్షులు కాసాని శ్రీనివాస్‌రావుగౌడ్ తెలిపారు. ఈమేరకు గురువవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ తరపున అన్నిస్థానాల్లో అభ్యర్థులను నిలబెడుతున్నామన్నారు. ఈ నేపథ్యంలో తొలివిడతగా 11 మంది అభ్యర్థులను ప్రకటించి పరిచయం చేశారు. పాలేరు నుంచి శ్రీనివాస్‌రావుగౌడ్, ఘన్‌పూర్ నుంచి అర్జున్, అసిఫాబాద్-తారాచందర్, హున్నాబాద్-పర్శరాములు, మంచిర్యాల-మల్లారెడ్డి, బెల్లంపెల్లి-కొమరేష్, మల్కాజ్‌గిరి-రమేష్‌గౌడ్, కంటోన్మెంట్ - వెంకటస్వామి, చొప్పదండి-బాబన్న, మానకొండూరు-దేవదాస్, సిరిసిల్ల -కోన శ్రీనివాస్‌లను ప్రకటించారు. మిగతా అభ్యర్థులను త్వరలోనే ప్రకటిస్తామని జైస్వరాజ్‌పార్టీ కలం గుర్తుపై పోటీ చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

## లాస్య పాదయాత్రకు హాజరు కానీ 5వ వార్డు ముఖ్య నేతలు

**కంటోన్మెంట్, అకో ్టబర్ 26 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందిత గురువారం 5వ వార్డులో పాదయాత్ర నిర్వహించారు. అయితే ఆ వార్డుకు సంబంధించిన బిఆర్ఎస్ అధ్యక్షుడు కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి పెంట శ్రీహరి, మార్కెట్ డైరెక్టర్ బాస్కర్ ముదిరాజ్, మారె ్కట్ మాజీ డైరెక్టర్ ఎం. షర్విన్, బిఆర్ఎస్ నాయకులు చొల్లేటి రమేశ్, రేపాల వెంకటేశ్వర్లు, రవిలు లాస్య పాదయాత్రకు హాజరు కాలేదు. తెలంగాణ ఉద్యమ నేత పెద్దాల నర్సింహయాదవ్ ముఖ్యనేతలను కలుపుకోకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకున్నందుకు లాస్య పాదయాత్రకు హాజరుకాలేదన్నారు. ఏది ఏమైనా బిఆర్ఎస్ అభ్యర్థి లాస్య విజయానికి తాము పాటుపడుతామన్నారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న సహకారంతో దళితబంధు పొందిన కిరణ్, పెంట శ్రీహరి, షర్విన్‌లు హాజరు కాకపోవడం సరైంది కాదని పలువురు వ్యక్తం చేశారు.

## కురుమ కులస్తులకు గొర్రెలు, బర్రెలు వద్దు... రాజకీయ పదవులు కావాలి



మాట్లాడుతున్న శ్రీనాథ్

**సైఫాబాద్, అక్టోబరు 26 ప్రభాతవార్త:**
రాష్ట్ర జనాభాలో 8 నుంచి 10 శాతంవరకు 40 లక్షల ఉన్న కురుమ కులస్తులకు అన్ని రాజకీయ పార్టీలు పది అసెంబ్లీ సీట్లు కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం డిమాండ్ చేసింది. బిఆర్ఎస్ పార్టీ కురుమ కులస్తులకు ఒక్క సీటు కూడా కేటాయించలేదని, ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడిస్తామని సంఘం హెచ్చరించింది. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం నాయకులు దొడ్డి శ్రీనాథ్ కురుమ, మాదారం కృష్ణ, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ కురుమ కులస్తులకు గొర్రెలు, బర్రెలు వద్దని, ఆర్థికంగా బలంగా ఉన్నామని, తమకు రాజకీయ పదవులు కావాలని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న గోషామహాల్ సీటును బిఆర్ఎస్ పార్టీ బేజిని శ్రీనివాస్‌కు కేటాయించాలని, కాంగ్రెస్ పార్టీ రెండు సీట్లు కేటాయించిందని, మరో రెండు సీట్లు రాజేంద్రనగర్‌తోపాటు మరొక సీటు కేటాయించాలని, బిజెపి ముషీరాబాద్‌లో బండారు విజయలక్ష్మికి, నాంపల్లిలో దేవర శ్రీనివాస్‌కు సనత్‌నగర్ చీర శ్రీకాంత్, జనగాం బేడి బీరప్పకు, వేములవాడ తుల ఉమాకు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. కురుమ కులస్తులు, యాదవ కులస్తులు వేర్వేరు అని, యాదవులు బిసి డి జాబితాలోని సీరియల్ నెంబరు 33లో ఉన్నారని, కురుమ కులస్తులు బిసి బి జాబితాలోని సిరియల్ నెంబరు 11 లో ఉన్నారని వారు స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో యాదవులు కురుమ కులస్తులను దగ్గరకు తీసి అంతా ఒక్కటేనంటారని ఆ తరువాత వేరు చేస్తారని ఆరోపించారు. కురుమకులస్తులకు పదివేల కోట్లతో కురుమ కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని, అర్ధసంచార జాతులైన తమకు సెమి నోబెటిక్ ట్రెబల్స్ లేదా ఎస్టీజాబితాలో చేర్చాలని, 60 సంవత్సరాలు నిండినవారికి 5 వేలు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, జివొ నెంబరు 559 ప్రకారం 5 ఎకరాల స్థలాని ్న గొర్రెల పెంపకం కోసం కేటాయించాలని, పీష్ ఫడరేషన్ చైర్మన్ పదవి కురుమ కులస్తులకే కేటాయించాలని వారు డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో నాయకులు పెంటప్ప, సురేష్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## నందివనపర్తి ధర్మన్నగూడ గ్రామాలలో పాషానరహరిల 35వ వర్ధంతి



కార్యక్రమంలో సిపిఎం పార్టి నాయకులు కార్యకర్తలు

**యాచారం, అక్టోబర్26, ప్రభాతార్త..**
నిరుపేదల అభ్యునతికి పేదరిక నిర్మూలణ కోసం శ్రమించి సమసమాజ నిర్మాణం కోసం ప్రాణాలు త్యాగం చేసిన ఇబ్రహింపట్నం నియోజకవర్గం జాపాల ముద్దుబిడ్డలు పాషా నరహరిల సేవలు వెలకట్టలెనివని సిపిఎం పార్టి జిల్లా కమిటి సభ్యులు అంజయ్య పెర్కోన్నారు. గురువారం మండల పరిదిలోని నందివనపర్తి ధర్మన్నగుడ గ్రామాలలో ఇబ్రహింపట్నం ఎర్రజెండ ముద్దుబిడ్డలు కాంమ్రేడ్ పాషా నరహరిల 35వ వర్ధంతి సభలు నిర్వహించారు. ఈ సందర్బంగా అయన కార్యక్రమంలో మాట్లాడుతూ.. భూస్వాములకు దోపిడికి దౌర్జన్యాలకు వెట్టిచారికికి వ్యతిరేకంగా అనిచివేయబడ్డ పేద ప్రజలను ఒకటి చేసి భూస్వాముల కబంధ హస్తాల కింద ఉన్న వందల ఎకరాల భూములను బయటకి తీసి పెద్దఎత్తున భూపోరాటాలు చేశారని గుర్తు చేశారు. భూముల్లో ఎర్ర జెండాలు పాతి వేలాది ఎకరాల భూములు పంచిన చరిత్ర ఎర్రజెండాకు ఉందన్నారు. పాషానరహరిల సేవలు మరవలేనివన్నారు. ఈ కార్యక్రమంలో మాజి మండల పరిషత్ అధ్యక్షులు శ్రీమన్నారాయణ, సర్పంచ్ బాషయ్య, ఉప సర్పంచ్ పాండుచారి, శాఖ కార్యదర్శి పి రమేష్, నందివనపర్తి శాఖ కార్యదర్శి మూలి జంగయ్య, సీనియర్ నాయకులు ఎన్ సత్తయ్య, ఎం రాములు, పి సత్య నారాయణ, కే భీమయ్య, రామారావు, నవిన్, రామకృష్ణ, నరిసిహ, ఈశ్వరయ్య , బుగ్గరాములు, టి శ్రీరాములు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గోన్నారు.

## గుర్రం కనిపించటం లేదని పోలీసులకు ఫిర్యాదు

**-కేసు నమోదు చేసిన పోలీసులు**

**శామీర్‌పేట, అక్టోబరు 26, ప్రభాతవార్త**
అలియాబాద్ ఆశ్రమంలో నివాసంలో ఉంటున్న దత్వా దర్శికి చెందిన గుర్రం కనిపించటం లేదని శామీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం ఉదయం తన గుర్రం తెల్లవారు జాము నుంచి కనిపించటం లేదని బాధితుడు దత్వా దర్శి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో వారు కేసు నమోదు చేశారు. శామీర్‌పేట పోలీసుల కథనం ప్రకారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్‌లో ఉన్న ఆశ్రమంలో దత్వా దర్శి అనే అతను నివాసం ఉంటున్నారు. అయితే అతని గుర్రంను రోజు మాదిరిగానే 25న సాయంత్రం 6.30గంటలకు దాణా పెట్టి పడుకుని మరల ఉదయం తెల్లవారు జాము 5గంటలకు లేచి చూసేసరికి గుర్రం కనిపించలేదని అన్నారు. ఆ వెంటనే ఆశ్రమంలోపల, బయట, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా గుర్రం ఆ చూకి కనిపించలేదని అన్నారు. ఈ విషయంపై శామీర్‌పేట పోలీసులను దాత్వ దర్శి ఆశ్రయించి తన గుర్రం కనిపించటం లేదని ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. దీంతో విచారణకు శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఎన్నికల కోడ్‌తో చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీల జోరు



లింగాపూర్‌తండ వద్ద పోలీసులు, అధికారులు వాహనాలను తనిఖీలు చేస్తున్న దృశ్యం

**శామీర్‌పేట, అక్టోబరు 26, ప్రభాతవార్త**
ఎన్నికల కోడ్ అమలులో భాగంగ లింగాపూర్ తండ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాలను పోలీసులు, అధికారులు తనిఖీలు ముమ్మరంగ చేస్తున్నారు. గురువారం మూడుచింతలపల్లి మండలంలోని లింగాపూర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాలను పోలీసులు, అధికారులు తనిఖీలు నిర్వహించటం జరిగింది. శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ వారి ఆధ్వర్యంలో సంబంధిత అధికారుల సమక్షంలో వాహనాల తనిఖీలు కొనసాగిస్తున్నారు. ఉద్దెమర్రి -మూడుచింతలపల్లి గ్రామాల మధ్య గల లింగాపూర్ తండ ప్రాంతంలో ఎన్నికల సందర్బంగ చెక్‌పోస్టును ఏర్పాటు చేసి వాహనాలను ముమ్మరంగ తనిఖీలు నిర్వహిస్తున్నారు. రాత్రింబవళ్లు చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాలను తనిఖీలు నిర్వహించటం జరుగుతుంది.

## ఎదులాబాద్‌లో ఘనంగా దుర్గామాత ఊరేగింపు



ఎదులాబాద్‌లో దుర్గామాత ఊరేగింపులో పాల్గొన్న మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ఘట్‌కేసర్, అక్టోబర్ 26, ప్రభాతవార్త:**
బతుకమ్మ , దసరా ఉత్సవాలతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొందని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్‌లో గురువారం రాత్రి దుర్గామాత ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. జైదుర్గాభవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దసరా సందర్భంగా ఏర్పాటు చేసిన మండపంలో దుర్గామాతను ప్రతిష్టించి నవరాత్రి ఉత్సవాలు అమ్మవారిని నవశక్తి రూపాలలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. బ్యాండ్‌మేళాలు, కళాకారులు, యువకుల నృత్యాలు మధ్య బాణాసంచాకాల్చుతూ ఘనంగా అమ్మవారి ఊరేగి ంపు జరిపి లక్ష్మినారాయణచెరువులో నిమజ్జనం చేశారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి విచ్చేసి కొబ్బరికాయ కొట్టి ఊరేగింపును ప్రారంభించి మాట్లాడుతూ దసరా ఉత్సవాలు గ్రామాల్లో ప్రజల మధ్య భక్తి, సమైఖ్యతను చాటుతాయన్నారు. ఈసందర్భంగా ప్రజాప్రతినిధులు, నాయకులను శాలువాలతో సన్మానించారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ తోటకూర అజయ్‌యాదవ్, మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, ఎంపిటిసి గట్టగళ్ల రవి, మాజీ ఎంపిటిసి కందుల కుమార్, సహకార సంఘం మాజీ డైరక్టర్ గాయరు విశ్వనాథం, మాజీ ఉపసర్పంచ్ బాలవెంకటేశ్, మాజీ వార్డుసభ్యులు బింగి యుగంధర్‌గౌడ్, బింగి సురేశ్‌గౌడ్, బొక్క ప్రభాకర్‌రెడ్డి, పసులాది నర్సింగ్‌రావు, నాయకులు బత్తిని కిష్టయ్య, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, బింగి వినోద్‌గౌడ్, బింగి రాజేందర్‌గౌడ్, బింగి శ్రీనివాస్‌గౌడ్, ఎన్. మురళీగౌడ్ పాల్గొన్నారు.

## ముగిసిన బెంగాలీ శ్రీసర్బోజననీ దుర్గామాత ఉత్సవాలు

**చార్మినార్, అక్టోబరు 26 ప్రభాతవార్త :** చార్మినార్ బెంగాలీ సమితి ఆధ్వర ్యంలో పాతబస్తీలో నిర్వహించిన బెంగాలీ శ్రీసర్బోజననీ దుర్గామాత ఉత్సవాలు అత్యంత వైభవంగా ముగిసాయి. వారంరోజులపాటు శ్రీదుర్గామాతకు బెంగాలీలు భక్తిశ్రద్దలతో పూజలు జరిపారు. దుర్గామాత విగ్రహాన్ని హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో న్యాయవాది హిరణ్మయి, దేబ్‌నాథ్, కౌశిక్, దుత్తా, కుల్‌దీప్, పార్రై తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో గణనీయంగా వృద్ధి సాధించింది

శామిర్‌పేట అక్టోబర్26, ప్రభాతవార్త : టెలివిజన్స్‌లో తెలంగాణ గణనీయంగా వృద్ధిని చూపించిందని అమెజాన్ ప్రకటించింది. మరియు పండగల సమయంలో 60శాతంకి పైగా 5జీ స్మార్ట్ ఫోన్స్ విక్రయించండి అమేజాన్ ఇండియా కోసం టీవి మరియు స్మార్ట్ ఫోన్ శ్రేణులతో ఈ ప్రాంతం ప్రముఖంగా నిలిచింది. నో కాస్ట్ ఈఎంఐ వంటి ఆర్థిక పథకాలు ద్వారా ప్రోత్సహించబడి, ప్రీమియం స్మార్ట్ ఫోన్స్ , పెద్ద స్క్రీన్ టెలివిజన్స్‌ను ఎంచుకునే కస్టమర్స్‌ల సంఖ్యలో రాష్ట్రం ప్రముఖ ప్రాంతాలలో ఒకటిగా నిలిచింది.

## బిఆర్ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి సంక్షేమం

-బిఆర్ఎస్ నాయకులు యాదగిరి,మహేందర్‌రెడ్డి



సంక్షేమ పథకాలను వివరిస్తున్న నాయకులు.

బొంరాస్‌పేట్,అక్టోబర్26,ప్రభాతవార్త :

తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని బొంరాస్‌పేట్ మండలం ఏర్పుమళ్ల గ్రామం వాయిలేటివలసిలో అంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఇంటింటి ప్రచారం కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు యాదగిరి,మహేందర్‌రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయడం లేదన్నారు.60 సంవత్సరాల్లో చేయని అభివృద్ధి కేవలం 10 సంవత్సరాల్లో బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిందన్నారు.రైతులకు ఉచిత విద్యుత్,రైతుబంధు, రైతుబీమా, వృద్ధులు,మహిళాలకు పెన్షన్లు పెంపు,దళితబంధు, బిసిబంధు, గ్రామాల్లో పచ్చదనం పరిశుభ్రత వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న బిఆర్ఎస్ పార్టీ కారుగుర్తుకు ఓటు వేసి కొడంగల్ ఎమ్మెల్యేగా పట్నం నరేందర్‌రెడ్డిని గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అంజయ్యగౌడ్, లక్ష్మయ్య, శ్రీనివాస్, నర్సిములు, ఉపేందర్, రమేష్, సత్యయ్య, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన భోజనం

-మండల విద్యాధికారి చంద్రప్ప



అన్నసాగర్ ప్రాథమిక పాఠశాలలో బ్రేక్ ఫాస్టు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మండల విద్యాధికారి చంద్రప్ప, సర్వశిక్ష అభియాన్ అధికారి రామ్‌కిషోర్,

కోట్‌పల్లి,అక్టోబరు 26, ప్రభాతవార్త;

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాతో అందుతుందని మండల విద్యాధికారి చంద్రప్ప అన్నారు. గురువారం నాడు కోట్‌పల్లి మండల పరిధిలోని అన్నసాగర్ ప్రాథమిక పాఠశాలల్లో తెలంగాణ ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టిన బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని జిల్లా సర్వశిక్ష అభియాన్ అధికారి రామ్‌కిషోర్‌లు కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్టు అందివ్వడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. విద్యార్థులకు ఉదయం బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్నం, భోజనం, ఇవ్వడం జరుగుతుందన్నారు.ప్రతి రోజు విద్యార్థులు డ్రాప్ అవుట్ కాకుండా వస్తారని ప్రభుత్వ ముఖ్య ఉద్దేశంతో ఈ బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని తీసుకోవచ్చారన్నారు.మండలంలోని అన్నసాగర్, బంట్వారం మండలంలోని మధ్వాపూర్, మాలసోమారం, ప్రాథమిక పాఠశాల బంట్వారం మండలంలోని ప్రారంభించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు,ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంచెందర్,మహేశ్వరి, మౌనిక, శివలక్షి, సీఆర్పీ నర్సిములు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు నిరసన సెగ



ధారూర్ అక్టోబరు26,ప్రభాతవార్త :

మండల పరిధిలోని నాగారం గ్రామంలో గురువారం ఎమ్మెల్యే అభ్యర్థి మెతుకు ఆనంద్ చేపట్టిన ప్రచారంలో భాగంగా గ్రామస్తులు ప్రచారాన్ని అడ్డుకొని నిరసన చేపట్టారు.గ్రామంలో నిజమైన నిరుపేదలకు ఇవ్వవలసిన ఇండ్లు,దళిత బంధు వంటి పథకాలు అర్హులకు అందడం లేదని ప్రశ్నించారు.దీంతో సమాచారం అందుకున్న పోలుసులు సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్థులను అదుపు చేశారు.

## అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ ఆదర్శం

-ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి



ఎమ్మెల్యే సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరిన ఇందూరు కార్యకర్తలు

పెద్దేముల్, అక్టోబరు 26, ప్రభాతవార్త:

అభివృద్ధి, సంక్షేమంలో దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శమని తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. గురువారం తాండూరులోని ఎమ్మెల్యే నివాసంలో పెద్దేముల్ మండలంలోని ఇందూరు, మంబాపూర్ గ్రామానికి చెందిన ఆయా పార్టీల కార్యకర్తలు రోహిత్‌రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ సిఎం కేసిఆర్ సర్కార్‌ను చూసే బిఆర్ఎస్‌లోకి వలసలు ప్రారంభమయ్యాయని అన్నారు. దేశంలో ఎక్కడలేని విధంగా రైతులకు నిరంతర ఉచిత విద్యుత్‌ను అందిస్తున్న ఘనత మన ముఖ్యమంత్రిదేనని అన్నారు. సిఎం కేసిఆర్ పాలనలో సబ్బండ వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని గుర్తుచేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఎన్నికల మెనిపెస్టోను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని అన్నారు. బిఆర్ఎస్ గెలుపు కోసం కార్యకర్తలంతా కలిసి కట్టుగా పనిచేయాలని అన్నారు.ఈ ఎన్నికలలో బిఆర్ఎస్‌కు తిరుగులేదని, తాండూరులో బంపర్ మెజార్టీతో గెలువబోతున్నామని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ఇందూరు యంపిటిసి ప్రవీన్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

-ఎదురెదురుగా రెండు బైకులు ఢీ

**చౌడపూర్ అక్టోబర్26,ప్రభాతవార్త :** మండల కేంద్రం గండి చెరువు తండా మైసమనమ దేవాలయం సమీపంలో బుధవారం రాత్రి ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో చికిత్స పొందుతూ శ్రీనివాస్ అనే యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే...క్కులచర్ల మండలం గొరిగడ్డ తండాకు చెందిన శ్రీనివాస్ తన భార్య జయ చౌడపూర్ వెళ్తుండగా...ఎదురుగా గుబ్బడి తండాకు చెందిన బాలు,సక్రు అతివేగంతో శ్రీనివాస్ బైక్‌ను ఢీకోట్టగా నలుగురికి తీవ్రగాయాలు అయ్యాయి.పాలమూరు ఆసుపత్రికి తరలించగా శ్రీనివాస్ మృతి చెందాడు.

# ఐకమత్యంతో కలిసి పనిచేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకుంటాం

ఆమనగల్లు, అక్టోబర్ 26 (ప్రభాతవార్త):

కార్యకర్తల్లో మనోధైర్యాన్ని నింపి ముందుకు సాగుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తలపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులతో ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ గెలుపు లక్ష్యంగా పనిచేస్తానని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆమనగల్లు మున్సిపల్‌లో ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ, బలహీన వర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీ పాలనలోనే అభివృద్ధి చెందారని, నేడు బీఆర్ఎస్ ప్రభుత్వంలో అగ్రవర్ణాల ఆధిపత్యంతో ఇబ్బందులకు గురవుతున్నారని,కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి బడుగుల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. కల్వకుర్తి ప్రాంతాన్ని కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి చేసిందని ఆయన గుర్తు చేశారు. కల్వకుర్తి ప్రాంతం నుండి సూదిని జైపాల్‌రెడ్డి జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీకి సారథ్యం వహించి కల్వకుర్తి ప్రాంత ప్రజలకు ఏ కష్టం వచ్చిన నేనున్నానంటూ భరోసాను కల్పించి సమస్యను పరిష్కరించి ఈ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీకి ప్రాణం పోశారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఓ సముద్రమని, సముద్రంలో అలలు వచ్చిపోయినట్లు కాంగ్రెస్ పార్టీలో లోటుపాట్లు జరుగుతుంటాయని, వాటిని సరిదిద్దుకొని గ్రూపు రాజకీయాలకు స్వస్తి పలికి ఐకమత్యంతో కలిసి ముందుకు సాగి రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని ఆయన పిలుపునిచ్చారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కసిరెడ్డి నారాయణరెడ్డి

**సుంకిరెడ్డికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తాం...**
**కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి**

## -40 సంవత్సరాలుగా మా కుటుంబం కాంగ్రెస్ జెండా మోస్తోంది

-ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఐక్యత ఫౌండేషన్ ద్వారా సేవ కార్యక్రమాలు చేపట్టి కాంగ్రెస్ పార్టీలో చేరి పార్టీ టికెట్ ఆశించిన సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని టీపీసీసీ అధ్యక్షులు ఎనుముల రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన విషయాన్ని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కల్వకుర్తి ప్రాంతం నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి కంకణబద్ధులై కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేసేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం చేపట్టిన ఎన్నికల మేనిఫెస్టోతో ప్రజల్లోకి వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతో పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బడుగు, బలహీన వర్గాల ప్రజలు అభివృద్ధి చెందేందుకు కాంగ్రెస్ పార్టీ ముందుకు వస్తుందని, ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేసేందుకు సిద్ధమవుతామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# కలిసికట్టుగా పనిచేద్దాం..

- కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుందాం..
- మోసపూరిత బీఆర్ఎస్‌ను గంగలో కలిపేద్దాం..
- కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్

తాండూరు, అక్టోబరు 26, ప్రభాతవార్త :

తాండూరులో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కలిసి కట్టుగా అందరం కలిసి పనిచేద్దామని డీసీసీబీ చైర్మన్ మనోహార్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ అన్నారు. గురువారం తాండూరు పట్టణంలోని వెంకోబా గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్, తాండూరు కాంగ్రెస్ అభ్యర్థి మనోహార్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, సీనియర్ నాయకులు ఉత్తంచంద్, జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అలీం, మహిళా అధ్యక్షురాలు శోభారాణి, పెద్దెముల్ వైస్ ఎంపీపీ మధులత, వివిద మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాండూరులో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కలిసికట్టుగా పనిచేద్దామని తెలిపారు. కాంగ్రెస్ ప్రవేశ పెట్టిన 6 గ్యారెంటీ పథకాలను ప్రజలకు తెలియపరచాలని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మోసపూరిత వాగ్దానాలు చేసి ప్రజలను మభ్య పెడుతున్న బీఆర్ఎస్ పార్టీని గంగలో కలిపేద్దామన్నారు. బీఆర్ఎస్‌ను ఓడించి తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. కాంగ్రెస్‌ను గెలిపించుకొని అభివృద్ధిని సాధించుకుందామని తెలిపారు. మరోవైపు నియోజకవర్గం వ్యాప్తంగా వివిద మండలాలు, గ్రామాల నుండి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. డీసీసీబీ చైర్మన్ మనోహార్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్‌లు వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వివిద మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ బస్సు యాత్రను విజయవంతం చేద్దాం..**

**– కాంగ్రెస్ అభ్యర్థి మనోహార్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్**

కాంగ్రెస్ బస్సు యాత్రను విజయవంతం చేయాలని డీసీసీబీ చైర్మన్, తాండూరు కాంగ్రెస్ అభ్యర్థి బుయ్యని మనోహార్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ అన్నారు. గురువారం తాండూరు పట్టణంలోని ఎస్‌విఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తాండూరు కాంగ్రెస్ అభ్యర్థి బుయ్యని మనోహార్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి ధారాసింగ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, వివిద మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 28న తాండూరులో కాంగ్రెస్ బస్సు యాత్రను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, సిఎల్‌పి నాయకులు బట్టి విక్రమార్క, మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్, డిసిసి అధ్యక్షులు రామ్మోహాన్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ సీనియర్ నేతలు హజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు 25వేల నుండి 40వేల వరకు పెద్ద ఎత్తున కార్యకర్తలతో బహిరంగ సభనిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల నేతలు, మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఆయా మండలాల నాయకులు కార్యక్రమానికి తరలించే విదంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తాండూరు నుండి ప్రారంభిస్తున్న బస్సు యాత్ర పరిగి మీదుగా, చేవెళ్లలో కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఉత్తంచంద్, జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అలీం, మహిళా అధ్యక్షురాలు శోభారాణి, పెద్దెముల్ వైస్ ఎంపీపీ మధులత, వివిద మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన నేతలు.

## కల్వకుర్తి అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీని గెలిపించండి

-యువజన కాంగ్రెస్ బైక్ ర్యాలీలో వంశీ,కసిరెడ్డి నారాయణ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కసిరెడ్డి నారాయణ రెడ్డి

**తలకొండపల్లి అక్టోబర్26,ప్రభాతవార్త :** కల్వకుర్తి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కసిరెడ్డి నారాయణ రెడ్డిని గెలిపించాలని ఏఐసిసి కార్యదర్శి వంశీచంద్ రెడ్డి అన్నారు.తలకొండపల్లి మండలంలో వెల్జాల్ గ్రామం నుంచి తలకొండపల్లి వరకు గురువారం యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వంశిచంద్ రెడ్డి,కసిరెడ్డి నారాయణ రెడ్డిలు మాట్లాడుతూ...కల్వకుర్తి ఎమ్మెల్యేగా మూడుసార్లు గెలిచిన జైపాల్ యాదవ్ నియోజకవర్గంలో ఎక్కడ అభివృద్ధి చేయలేదని వారు విమర్శించారు.ఎన్నికల్లో ఓట్ బ్యాంకును ఉపయోగించుకునేందుకు జైపాల్ యాదవ్ కృషి చేశాడని వారన్నారు.రాష్ట్రంలో కెసిఆర్ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి తుంగలో తొక్కారని,తెలంగాణ ఏర్పాటుకు అహర్నిశలు కృషి చేసిన సోనియా గాంధీకి కృతజ్ఞతగా ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీ సింగ్,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి,ఎంపిటిసిల ఫోరం మండల అధ్యక్షుడు జోగు రమేష్,నాయకులు మోహన్ రెడ్డి,అంజయ్య గుప్తా,మాజీ ఎంపిటిసి శ్రీనివాసమూర్తి,నాయకులు అంబాజీ, జనార్ధన్‌తో పాటు ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,పాల్గొన్నారు.

## చాకల్‌పల్లిలో కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



చౌడపూర్ అక్టోబర్26,ప్రభాతవార్త :

మండల పరిధిలోని చాకల్‌పల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని,అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని ఇంటింటికి వెళ్లి పరిగి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ రామ్మోహన్ రెడ్డి,సతీమణి ఉమా రామ్మోహన్ రెడ్డి ప్రచారం చేశారు.రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీదే అధికారమని పరిగిలో కాంగ్రెస్ జెండా ఎగరేస్తామని ఉమా రామ్మోహన్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అశోక్ కుమార్,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాము,చాకల్‌పల్లి సర్పంచ్ రాములమ్మ,శేఖర్,గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటయ్య,మండల ప్రధాన కార్యదర్శి దమోదర్ రెడ్డి,మండల మహిళా నాయకులు అనిత రెడ్డి,చంద్రశేఖర్,శంకర్ నాయక్,విజయ్,సత్యం కృష్ణయ్య,వెంకట్రాములు,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఊటకుంట పనుల సందర్శన



వికారాబాద్ మండలంలోని పులుమద్ది గ్రామంలో నిర్మించిన ఊటకుంట పనులను పరిశీలించిన పిఆర్ అండ్ ఆర్‌డి డైరెక్టర్ ఎం, హనుమంతరావు

వికారాబాద్,అక్టోబరు 26, ప్రభాతవార్త;

వికారాబాద్ మండలంలోని పులుమద్ది గ్రామంలో ఉన్న పీర్లగుట్ట సమీపంలో నిర్మించిన ఊటకుంట పనులను గురువారం నాడు పిఆర్ అండ్ ఆర్‌డి డైరెక్టర్ ఎం హనుమంతరావు సందర్శించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ.పులుమద్ది గ్రామం వికారాబాద్ మండలంలో పి.ఎం.కె.ఎస్ .వై ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన పథకంలో భాగంగా పీర్లగుట్ట సమీపంలో నిర్మించిన ఊటకుంట పనులను సందర్శించి పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి కృష్ణన్, జెడ్పిసిఓ సుభాషిని, హార్టికల్చర్ అధికారి చక్రపాణి, డిపిఓ, తరుణ్‌కుమార్, వాటర్ షెడ్ సిబ్బంది మరియు ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు,

## కొడంగల్‌కు చేరుకున్న ఎన్నికల సామాగ్రి

కొడంగల్,అక్టోబర్ 26ప్రభాతవార్త

త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కొడంగల్ నియోజకవర్గానికి ఈవీఎం,వీవీ ప్యాట్లు చేరుకున్నాయి.గురువారం ప్రత్యేక వాహనంలో సాయుధ బలగాల భద్రతల మధ్య ఎన్నికల సామాగ్రిని తీసుకువచ్చారు.ఎన్నికల సామాగ్రిని జిల్లా అడిషనల్ కలెక్టర్,కొడంగల్ అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి లింగ్యానాయక్ పర్యవేక్షించారు.కొడంగల్ అసెంబ్లీ-72 స్థానినికి గాను 275 పోలింగ్ కేంద్రాలకు గాను సరిపడా సీయూ-343,బీయూ-343,వీవీ ప్యాట్లు-385 సామాగ్రిని భద్రపరిచారు.ఈ మేరకు గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు.ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భారీ పోలీసు బందోబస్తు మధ్య భద్రపరిచినట్లు అధికారులు తెలిపారు.




ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన స్ట్రాంగ్ రూం ముందు బందోబస్తులో పోలీసు సిబ్బంది

# ఎంపీ రంజిత్‌రెడ్డికి జిల్లాలో ఓట్లు అడిగే హక్కు లేదు..

-గడిచిన నాలుగున్నరేళ్ళలో జిల్లాకు వచ్చిన ఎంపీ నిధులు శూన్యం

-నిధుల కెటాయింపుపై రంజిత్‌రెడ్డితో చర్చకు సిద్ధం

-కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు రత్నారెడ్డి

వికారాబాద్,అక్టోబర్ 26, ప్రభాతవార్త:

చేవెళ్ళ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి కి వికారాబాద్ జిల్లాలో ఓట్లు అడిగే హక్కు లేదని, ప్రచారం పేరుతో జిల్లాలో పర్యటించడం సిగ్గు చేటని కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షులు జె.రత్నారెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. గురువారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో స్వర్గీయ మాజీ ఎంపీ జైపాల్‌రెడ్డి వికారాబాద్ అభివృద్ధికి వందల కోట్ల నిధులు తీసుకువచ్చారని, ఇందులో భాగంగా వికారాబాద్ పట్టణంలో శాటిలైట్ సిటీ కింద రూ.150 కోట్లతో అండర్ డ్రైనేజీ, మంచినీటి పైప్ లైన్ పనులు చేపట్టడం జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుత బీఆర్ఎస్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి వికారాబాద్ జిల్లాకు ఒరగబెట్టిందేమి లేదని దుయ్యబట్టారు. మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి సైతం జిల్లాకు ఎంపీ నిధులు తేవడంలో విఫలమయ్యారని, విశ్వేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డిలు దొందు..దొందే అన్న రీతిలో నిధుల కెటాయింపు జరిగిందని మండిపడ్డారు. ఎంపి రంజిత్‌రెడ్డి ఎక్కడ నిధులు వెచ్చించారో ప్రజలకు తెలుపాల్సిన అవసరం ఎంతైన ఉందని, ఈ విషయంపై ఎంపీ రంజిత్‌రెడ్డి తో బహిరంగ చర్చకు తాను సిద్దమని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఆనంద్ పథకాల పేరు చెప్పి ఓట్లు అడుగుతున్నారు తప్పా..నియోజకవర్గంలో ఎక్కడ చూసిన అభివృద్ధి శూన్యమని ఎద్దేవ చేశారు. మోత్కుపల్లి-బార్వాద్ రోడ్డు, బంట్వారం-తొర్మామిడి రోడ్డు, రాళ్ళ చిట్టంపల్లి-మైలార్‌దేవరంపల్లి రోడ్డు అధ్వాన్నంగా ఉన్నాయని, గడిచిన నాలుగున్నరేళ్ళలో కనీసం రోడ్లు సైతం వేయించలేని దయనీయ స్థితిలో ఎమ్మెల్యే ఆనంద్ ఉన్నారని అన్నారు. ప్రజలకు ముఖ్యంగా రవాణా సదుపాయం ముఖ్యమని, రోడ్లు, బ్రిడ్జీలు బాగుంటేనే రవాణా వ్యవస్థ సవ్యంగా సాగుతుందని పేర్కొన్నారు. ఏండ్లు గడిచిన నాగసముందర్, దోర్నాల్, నూరుల్లాపూర్ బ్రిడ్జీ పనులు కార్యరూపం దాల్చలేదని అన్నారు. సంబంధిత గ్రామాల ప్రజల వద్దకు ఓట్లు అడిగేందుకు వెళ్ళేందుకు బీఆర్ఎస్ నాయకులకు, ఎమ్మెల్యేకు సిగ్గుండాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారని, త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో వారి విలువైన ఓటుతో బీఆర్ఎస్ అభ్యర్థికి తగిన బుద్ధి చెబుతారని అన్నారు. దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అనుకూల వాతావరణం నెలకొందని, త్వరలో జరుగనున్న ఎన్నికల్లో వికారాబాద్ నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపడుతుందని, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్ అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

## బీఆర్ఎస్ నాయకులు చిల్లర రాజకీయాలు మానుకోవాలి

-టీపీసీసీ సభ్యులు ఎండీ.యుసుఫ్,నందారం ప్రశాంత్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కొడంగల్,అక్టోబర్ 26ప్రభాతవార్త

కొడంగల్‌లో బీఆర్ఎస్ నాయకుల ఆటలు సాగవని,చిల్లర రాజకీయాలు ఇకనైనా మానుకోవాలని టీపీసీసీ సభ్యులు ఎండీ.యుసుఫ్,మండల కాంగ్రెస్ పార్టీ అద యక్షులు నందారం ప్రశాంత్‌లు హితవు చెప్పారు.గురువారం వారు కొడంగల్‌లో పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి నివాసంలో విలేకరులతో మాట్లాడారు.కర్నాటక రాష్ట్రానికి చెందిన కొంతమంది కిరాయి వ్యక్తులకు డబ్బులిచ్చి అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయడం లేదని బుధవారం కొడంగల్‌లో ర్యాలీతో చిల్లర రాజకీయాలకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. కర్నాటక రాష్ట్రం నుంచి వచ్చిన వారు రైతులు కాదని,ఆ రాష్ట్ర బీజేపీ పార్టీ వ్యక్తులతో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ర్యాలీ అట్టర్‌ప్లాప్ అయ్యిందని పేర్కొన్నారు.కొడంగల్‌లో కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డిపై ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి చేసిన విమర్శలను తిప్పికొడుతు అవగాహన రాహిత్యంతోనే ఎమ్మెల్యే అలా మాట్లాడుతున్నాడని,అసలు కొడంగల్ నుంచి నీపైనే రేవంత్‌రెడ్డి పోటీ చేస్తున్న విషయాన్ని గ్రహించాలని హితవు చెప్పారు.కొడంగల్ నియోజకవర్గంలో సబ్‌స్టేషన్‌లు,ప్రభుత్వ డి గ్రీ కళాశాల,కోస్గిలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు మంజూరీ చేసింది రేవంత్‌రెడ్డి కాదా అని ప్రశ్నించారు.విద్య,వైద్యం సదుపాయాలు కల్పించిన ఘనత రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు.అభివృద్ధిపై ఆధారాలతో సహ నిరూపించేందుకు తాము సిద్దంగా ఉన్నామని,దమ్ముంటే బీఆర్ఎస్ నాయకులు బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు కల్లబొల్లి మాటలు మాట్లాడడం మానుకోవాలని సూచించారు.సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కొడంగల్ నయ్యూం, సోమశేఖర్,దాము,అసీఫ్‌ఖాన్,మున్సిపల్ కౌన్సిలర్ శంకర్‌నాయక్,తార్యానాయక్ పాల్గొన్నారు.

## నేటి నుంచి పట్టణంలో పైలెట్ పాదయాత్ర

- బీఆర్ఎస్ పథకాలపై ఇంటింకి ప్రచారం
- మూడు రోజుల పాటు వార్డులలో పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి.

**తాండూరు, అక్టోబరు 26, ప్రభాతవార్త:** ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి నేటి నుండి తాండూరు పట్టణంలో పాదయాత్ర చేపట్టనున్నారు. పక్కా ప్రణాళికతో బీఆర్ఎస్ పథకాలపై ఇంటింటికి ప్రచారం నిర్వహించనున్నారు. ముడూ రోజుల పాటు మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులలో పర్యటించనున్నారు. గురువారం పట్టణంలోని తన నివాసంలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పార్టీ నేతలు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు పర్యటనపై చర్చించారు. శుక్రవారం ఉదయం 8గంటల నుండి పట్టణంలోని 14 వ వార్డు నుండి 23వ వార్డు వరకు, 26వ వార్డు నుండి 31వ వార్డు వరకు పాదయాత్ర చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ముందుగా పట్టణంలోని పాత తాండూరు కోటేశ్వర దేవాలయం, నిజాం షాహీ దర్గాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి పాధయాత్ర చేపట్టనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పార్టీ జెండాలతో పాల్గొనాలని సూచించారు. పాదయాత్ర విజయవంతం చేసేందకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కరణం పురుషోత్తంరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, వైస్ చైర్‌పర్సన్ పట్లోళ్ల దీప, మాజీ చైర్‌పర్సన్ కోట్రీక విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వీణా, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అప్పు(నయ్యూం), మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పరిమళ, పట్టణ మహిళా అధ్యక్షురాలు సంగీత ఠాకూర్, మున్సిపల్ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన రిటర్నింగ్ అధికారి రాహుల్‌శర్మ

**వికారాబాద్,అక్టోబర్ 26, ప్రభాతవార్త:** స్థానిక మేరీ నాట్స్ పాఠశాలలో వికారాబాద్ అసెంబ్లీ నియోజక వర్గమునకు సంబంధించిన ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ ను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో వికారాబాద్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి రాహుల్‌శర్మ గురువారం సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయన భద్రపరిచిన ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామాగ్రిని పరిశీలించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని,ఇతర పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. ఈ తనిఖీలో వికారాబాద్ శాసనసభ నియోజకవర్గం తహసీల్దారులు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.




వికారాబాద్‌లోని ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి రాహుల్‌శర్మ